సాక్షి చిత్తూరు

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



'ఎక్స్‌ప్రెస్' హైవే

చెన్నై–బెంగళూరు 6 ట్రాక్ హైవే పనులు శరవేగంగా సాగుతున్నాయి. బ్రిడ్జిలు, కల్వర్టు నిర్మాణాలు జరుగుతున్నాయి. - IIలో



పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దని సచివాలయ కార్యదర్శులకు జిల్లా సంక్షేమశాఖ అధికారి రాజ్యలక్ష్మి సూచించారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	25
తిరుపతి	36	26
తిరుమల	32	22
గూడూరు	37	27
నగరి	37	26

చెదిరిన పొదరిల్లు



భూపాలన్ ఇంటి వద్ద విషాదఛాయలు (ఇన్‌సెట్) భూపాల్, నీలావతి, పుట్టిన రోజు వేడుకల్లో నితిన్, ఉమేష్(ఫైల్)

అదొక సామాన్య కుటుంబం. ఉన్నంతలో ఆనందంగా జీవితాన్ని గడుపుతూ భర్తకు చేదోడుగా ఉండే భార్య, ముద్దులొలికే ఇద్దరు బిడ్డలు. ఎన్నో ఆశలతో కట్టుకున్న ఇల్లు. అందరూ ఈర్ష్యపడేలా జీవిస్తూ వచ్చిన ఆ కుటుంబం రోడ్డు ప్రమాదంలో అసువులు బాసింది. ఇంటి నుంచి ఆనందంగా బైక్‌పై బయలుదేరిన వారు మళ్లీ విగతజీవులుగా ఇంటికి చేరడం స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. తమతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ గ్రామస్తులు గుండెలు బాదుకున్న తీరు చూపరులకు కన్నీళ్లు తెప్పించింది. మరోవైపు బతుకుదెరువు కోసం జాతీయ రహదారిపై వైట్ మార్కింగ్‌లు వేసే పనిని ఎంచుకున్న తండ్రీకొడుకులు సంపాదనే ఆ కుటుంబానికి ఆధారం. తాము కష్టపడుతున్నా తమ కుటుంబాన్ని పోషిస్తున్నాము కదా అన్న ఆనందాన్ని రోడ్డు ప్రమాదం కాటేసింది. తండ్రి చనిపోగా కొడుకు పరిస్థితి విషమంగా ఉంది. ఇలా రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాలను విషాదంలోకి నెట్టేసింది.



భూపాలన్ కొత్తగా నిర్మించుకున్న ఇల్లు

- రక్తసిక్తమైన ధర్మాపురం రహదారి
- ఒకే కుటుంబంలో నలుగురు మృతి
- మిట్టపాళెం గ్రామంలో విషాదఛాయలు
- మరో కుటుంబంలో యజమాని దుర్మరణం
- క్షతగాత్రులు నలుగురు రుయాకు తరలింపు

నగరి : మున్సిపల్ పరిధి ధర్మాపురం వద్ద జాతీయ రహదారి శుక్రవారం ఉదయం రక్తసిక్తమైంది. ఏక కాలంలో నాలుగు వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో వాహనాల్లో ప్రయాణించేవారు చెల్లాచెదురై రోడ్డుకు ఇరువైపులా ఎగిరిపడ్డారు. అకస్మాత్తుగా ఈ సంఘటన జరగడంతో వెనుకవైపున వస్తున్న వాహనాల్లో వచ్చేవారు ఉలిక్కిపడ్డారు. రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందగా, నలుగురు తీవ్రగాయాల పాలయ్యారు. సీఐ సురేష్ కథనం మేరకు.. ధర్మాపురం వద్ద జాతీయ రహదారి సిబ్బంది తమ టాటాఏస్ వాహనాన్ని రోడ్డుపై ఉంచి నిర్వహణ పనుల నిమిత్తం జనరేటర్ మరమ్మతులు చేస్తుండగా తిరుపతి నుంచి చెన్నైకి వెళుతున్న సిమెంటు లారీ అదుపు తప్పి టాటాఏస్ వాహనాన్ని వేగంగా ఢీకొంది. అదేసమయంలో నగరి నుంచి పుత్తూరు వైపుగా వస్తున్న కారును, బైకును కూడా ఢీకొంది. ఏక కాలంలో నాలుగు వాహనాలు ప్రమాదానికి గురికావడంతో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఉమేష్ (3) సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందారు. మిగిలిన వారిని ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మిట్టపాళెం గ్రామానికి చెందిన భూపాలన్ (29), నితిన్ (4), తమిళనాడు వేలూరుకు చెందిన కన్నన్ (50) మృతిచెందారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన తిరునావుక్కరసు (32), విల్లుపురానికి చెందిన మణికంఠన్ (23), హరికృష్ణ (21), అలందూర్‌పేటకు చెందిన దినేష్ (18), మిట్టపాళెంకు చెందిన నీలావతి (26)ని రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ నీలావతి మృతిచెందగా, తిరునావుక్కరసు పరిస్థితి విషమంగా ఉంది.

న్యూట్రల్‌లో రావడంతోనే

నగరి పుత్తూరు మార్గంలో కనంమిట్ట నుంచి రోడ్డు డౌన్ కావడంతో గేర్‌నుంచి న్యూట్రల్‌కు తెచ్చి వాహనాన్ని నడపడం వల్లే సిమెంట్ లారీ అదుపు తప్పి నేషనల్‌హైవే పనుల నిమిత్తం వచ్చిన టాటాఏస్ వాహనాన్ని ఢీకొంది. దీంతో ఆ వాహనం రోడ్డుకు అడ్డంగా తిరగడంతో బైక్‌ను ఢీకొంది. ఆ బైక్ ఎగిరి కారుపై పడడంతో కారు ప్రమాదానికి లోనైంది.

మంత్రి ఆర్కేరోజా దిగ్భ్రాంతి

మండలంలోని మిట్టపాళెం గ్రామంలో ఒకే కుటుంబంలో నలుగురు మృతిచెందడంతో మంత్రి ఆర్కేరోజా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన సంతాపాన్ని తెలియజేశారు.



ప్రమాద స్థలంలో నితిన్, ఉమేష్, భూపాల్



క్షతగాత్రులను తరలిస్తున్న పోలీసులు, వైద్యసిబ్బంది



ప్రమాదానికి కారణమైన సిమెంటు లారీ

హుటాహుటిన చేరుకున్న యంత్రాంగం

ప్రమాదం జరిగిన సంగతి తెలిసిన వెంటనే డీఎస్పీ రవికుమార్, ఆర్డీవో సుజన, సీఐ సురేష్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. అంబులెన్స్‌ల ద్వారా క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

కన్నతండ్రి 'మూగ'రోదన

మిట్టపాళెంలో కుమార్తె నీలావతి ఇంటి వద్దే ఉన్న ఆమె తండ్రి మునస్వామి వీరి వెంటే మరో ద్విచక్ర వాహనంలో తన స్వగ్రామం వేణుగోపాలపురానికి బయలు దేరాడు. అతను వెనుకవైపు వస్తుండగా ముందువైపు ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తన కళ్లముందే కుమార్తె, అల్లుడు, మనవళ్లు రక్తసిక్తమై పడిఉండడం చూసి చలించి పోయాడు. తన వివరాలు చెప్పి ఎవరినైనా పిలుద్దామన్నా పుట్టుకతో మూగవాడు కావడంతో ఎవరికీ సమాచారం అందించలేక అయినవాళ్లను చూస్తూ ఆర్తనాదాలు పెట్టాడు. కాగా నీలావతి తల్లి చిన్నతనంలోనే టపాకాయల పేలుళ్లలో చనిపోయింది.

పుట్టింటికి చేరుకోకనే..

భూపాలన్ కుటుంబం వారం కిందటే కొత్తింటిలో చేరింది. పిల్లల పుట్టిన రోజు వేడుకలు నిర్వహించా రు. భార్య నీలావతి పుట్టింటికి వెళ్లాలని కోరడంతో పిల్లలు ఇద్దరినీ, భార్యను తీసుకుని పుత్తూరు మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి బైక్‌లో బయలుదేరాడు. మృత్యువు లారీ రూపంలో వారిని కాటేసింది.

బతుకుదెరువుకు వచ్చి

తమిళనాడు వేలూరుకు చెందిన తండ్రీ కొడుకులు కన్నన్ (50), తిరునావుక్కరసు (32) జాతీయరహదారి పనులకు వెళుతున్నారు. వీరిద్దరి సంపాదనపైనే కుటుంబం ఆధారపడి ఉంది. రోడ్డుపై మార్కింగ్ వేసే పనులను ఎంచుకున్నారు. రోడ్డు ప్రమాదంలో తండ్రి కన్నన్ మృతిచెందగా, తిరునావుక్కరసు పరిస్థితి విషమంగా ఉంది.

న్యూస్‌రీల్

బోయకొండలో శ్రావణ సందడి



విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: శ్రావణ మాసం చివరి శుక్రవారం బోయకొండ శ్రీగంగమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నిత్య కైంకర్యాలు జరిగాయి. రాహుకాల సమయం 10–30 నుంచి 12 గంటల మధ్య శాస్త్రోక్తంగా అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టు పీతాంబరాలు, స్వర్ణాభరణాలు, పరిమళ భరిత పుష్పమాలికలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తుల పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.

జీఐఎస్ సర్వే వేగవంతం

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న జీఐఎస్ సర్వేను వేగవంతంగా చేయాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఈఈ, డీఈ, ఏఈలతో ఆయన మాట్లాడారు. విద్యుత్ పరికరాల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని తెలిపారు. లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు లెక్క వేసి వాటి ద్వారా ఎంత విద్యుత్ సరఫరా అవుతుందో నమోదు చేయాలన్నారు. వందశాతం విద్యుత్ బిల్లు వసూలు చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ కనెక్షన్లను పెండింగ్‌లేకుండా ఇవ్వాలని ఎస్‌ఈ తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు శుక్రవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్‌కు 36 బెంచ్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చిత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు అదాలత్ ప్రారంభవుతుందన్నారు. లోక్ అదాలత్ విజయవంతానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు కృషి చేయాలని ఆయన తెలిపారు.

పకడ్బందీగా జగనన్న ఆరోగ్య సురక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పగడ్బందీ అమలులో భాగంగా వలంటీర్లు ఇంటింటి సర్వే చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంఅమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పకడ్బందీగా సర్వే నిర్వహించాలన్నారు. ఈనెల 12వ తేదీ లోపు క్యాంప్ ల నిర్వహణ జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్సీ కార్డుల ముద్రణ ప్రారంభం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని డీటీసీ కార్యాలయంలో శుక్రవారం ఆర్సీ, డీఎల్ కార్డుల ముద్రణ ప్రారంభమైంది. చకచక కార్యాలయ సిబ్బంది ముద్రణ పనులను చూస్తున్నారు. త్వరితగతిన కార్డులను మంజూరు చేసే ప్రక్రియను ప్రారంభించనున్నారు. కాగా జిల్లాకు తొలివిడతగా 15వేల కార్డులు సరఫరా అయ్యాయి. ఈ ముద్రణ పూర్తయితే మరో 5 వేలకు పైగా కార్డులు వస్తాయని డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్ర అవార్డు గ్రహీతకు సన్మానం



మనోహర్‌నాయుడును సన్మానిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మనోహర్‌నాయుడును డీఈవో విజయేంద్రరావు సత్కరించారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ విద్యార్థులను లక్ష్య సాధన దిశగా నడిపించే బాధ్యత గురువులదేనని తెలిపారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి సర్కారు బడిలో చదువుతున్న విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. సమగ్రశిక్ష సీఎంవో ఉదయలక్ష్మీ, సెక్టోరల్ మాజీ అధికారి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

విరివిగా రుణ సౌకర్యం కల్పించాలి

- జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సహకరించాలి
- బ్యాంకర్ల సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు



పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : బ్యాంకర్లు విరివిగా రుణ సౌకర్యం కల్పించాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ బ్యాంకుల మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుని బ్యాంకర్లు అర్హులకు రుణాలు అందించాలన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలు, గృహ నిర్మాణ శాఖలకు అందించే రుణాల లక్ష్యాలను అధిగమించాలని చెప్పారు. వ్యవసాయ రుణాలు పొందే ప్రతి ఒక్కరని ఫ్రీ ఇన్సూరెన్స్‌లో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. కౌలు రైతులకు రుణాల మంజూరుపై ఆర్బీకేల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. బ్యాంకుల సేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పాడి రైతులకు రుణాలు ఇచ్చి వారి అభ్యున్నతికి చర్యలు చేపట్టాలన్నారు. 18 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా ఉండాలని రిజర్వ్ బ్యాంకు ప్రతిపాదనను అమలు చేయాలని ఆదేశించారు.

లక్ష్యాలను అధిగమించాలి

డీఆర్‌డీఏ, మెప్మా శాఖలు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంక్ లింకేజీ రుణాల లక్ష్యాలను సాధించాలని శ్రీనివాసులు తెలిపారు. మెప్మా పరిధిలో పీఎం స్వనిధిలో కింద పంపిన 5,703 దరఖాస్తులను బ్యాంకర్లు పరిశీలించాలని పేర్కొన్నారు. 7వ విడత జగనన్న తోడు పథకంలో అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకులకు పంపిన 19,036 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జగనన్న బడుగు వికాసం పథకంలో ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను మరింతగా ప్రోత్సహించాలన్నారు. పారిశ్రామిక ప్రగతిలో పీఎంఈజీపీలో రూ.7.60 కోట్లు మార్జిన్ మనీతో 166 ప్రాజెక్టుల దరఖాస్తులను బ్యాంకులకు పంపినట్లు చెప్పారు. ఇందులో 49 ప్రాజెక్టులకు రూ.2.14 కోట్లు మార్జిన్ మనీ క్లెయిమ్ చేసినట్లు తెలిపారు. ఎల్‌డీఎం హరీష్, నాబార్డ్ ప్రతినిధులు ప్రవీన్, సునీల్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తుల రద్దీకనుగుణంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

- రైల్వే స్టేషన్ల నుంచి కూడా బస్సులు నడపాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు




మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు, వేదికపై ఎమ్మెల్యే బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలకు అశేషంగా విచ్చేసే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం దేవస్థానం సమావేశ మందిరంలో ఈనెల 18 నుంచి జరుగనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు అధ్యక్షతన జిల్లా స్థాయిలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ శాఖల వారీగా కేటాయించిన పనులపై సమీక్షించారు. పంచాయతీ అధికారులు శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆర్టీసీ అధికారులు చిత్తూరు, తిరుపతి బస్టాండ్‌ల నుంచి కాకుండా రైల్వే స్టేషన్ల నుంచి కాణిపాకానికి బస్సు సౌకర్యం కల్పించాలని సూచించారు. తాగునీరు అందుబాటులో ఉండాలన్నారు. ఆయా శాఖల అధికారులు గతంలో ఏవైనా లోపాలు తలెత్తిఉంటే పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీసు శాఖ గట్టి బందోబస్తు నిర్వహించాలన్నారు.

సమష్టిగా పనిచేయాలి

ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాట్లాడుతు సమష్టి కృషితో బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. చైర్మన్ మోహన్ రెడ్డి మాట్లాడుదూ బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అన్నదాన ప్రసాదాలు అందించనున్నట్లు వివరించారు. అడిషనల్ ఎస్పీ సుధాకర్, డీఎస్పీ, శ్రీనివాస మూర్తి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, తహసీల్దార్ సుశీల, చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి, కాణిపాకం ఎస్ఐ శ్రీనివాసులు, డీపీఓ లక్ష్మీ, ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు, సూపరింటెడెంట్లు పాల్గొన్నారు.

• శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం





వరలక్ష్మీ వ్రత పూజల్లో పాల్గొన్న మహిళలు (ఇన్‌సెట్) ఉత్సవమూర్తుల ఊరేగింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆస్థాన మండపంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని కల్యాణ వేదికలో శ్రీసిద్ధి, బుద్ధి, వినాయకస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో ఉత్సవమూర్తులను ఆస్థాన మండపం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి వేంచేపు చేశారు. తదుపరి అర్చక, వేదపండితులు శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. మహిళలు అశేషంగా వ్రతంను ఆచరించారు. పూజా సామాగ్రిని ఆలయ అధికారులు అందించారు. ఆలయ చైర్మన్, ఈఓ గాజులు, పసుపు కుంకుమ ప్రసాదం అందించారు. ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి రాజనాలబండ తిరుణాల



ముస్తాబైన ఆలయం

- పూజల్లో పాల్గొననున్న 18 గ్రామాల ప్రజలు
- లక్ష్మీనరసింహస్వామి కొండపై వేడుకలకు ఏర్పాట్లు

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాల బండ శ్రీవీరాంజనేయస్వామి ఆలయ తిరునాళ్లు శని, ఆదివారాలు వైభవంగా నిర్వహించనున్నారు. శ్రావణమాస చివరి శనివారం రోజున రాజనాలబండపై వెలసిన స్వామివారికి ప్రత్యేకపూజలతో పాటు పక్కనే ఉన్న కొండపై వెలసి ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని భక్తులు పూజలు చేయడం ఆనవాయితీ. 18 గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో తిరునాళ్లలో పాల్గొంటారు. కొత్తగూబలవారిపల్లె వద్ద దాసరయ్యగారిపల్లె, పెద్దూరు, ఉటూరు గ్రామాలకు చెందిన దేవరెద్దులతో గ్రామపెద్దలతో మేళతాళాల నడుమ రాజనాలబండవద్దకు చేరుకొంటారు. కొలింపల్లె నుంచి గ్రామదేవత బోయకొండ గంగమ్మ తల్లి ఉత్సవమూర్తితో కలసి ఊరేగింపుగా కోలాటాలు, చెక్కభజనలు, పిల్లనగ్రోవులతో చేరుకొని బండారు పంపకం చేస్తారు. అనంతరం దేవరెద్దులు, బోయకొండ అమ్మవారిని మేళతాళాల నడుమ రాజనాలబండకు వేంచేపు చేస్తారు. శ్రీవీరాంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తారు. ఉట్లోత్సవం, పోకుమాను బరుగుట తదితర కార్యక్రమాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొంటారు. ఈమేరకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

టీడీపీకి ఓటు వేస్తే వృథా



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తే వృథా అవుతుందని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, ఆయన పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. 'అవినీతి నిరోధక శాఖ నోటీసులు ఇస్తే, సమాధానం ఇవ్వక, నన్ను అరెస్టు చేస్తారు, పార్టీ శ్రేణులు యుద్ధం చేయాలి' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ హింసా రాజకీయాలకు తెరతీశారని విమర్శించారు. హైదరాబాద్ రాజధానిగా మరిన్ని సంవత్సరాలు కొనసాగే అవకాశం ఉన్నా, ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికి రాత్రికి రాత్రే పారిపోయి వచ్చి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని విమర్శించారు. 35 ఏళ్లుగా కుప్పం ప్రజల ఓట్లతో గెలుస్తూ నియోజకవర్గాని చేసింది ఏమి లేదన్నారు. ఒక్క ప్రభుత్వ రంగ పరిశ్రమ అయినా తీసుకువచ్చారని అని ప్రశ్నించారు. కుప్పానికి ఉర్దూ జూనియర్ కళాశాల ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. కియా మోటార్స్ ఎందుకు తీసుకురాలేదో ప్రజలకు చెప్పాలన్నారు. తాను జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో నాలుగేళ్ల పాలనలో ఏమి చేశానో చెబుతానని, చంద్రబాబు 35 ఏళ్లుగా ఏమి చేశారో చెప్పాలని సవాలు విసిరారు. రామకుప్పం మండలం కొల్లుపల్లెలో ప్రారంభమైన టీడీపీ దాడులు తూర్పుగోదావరి వరకు పాకిందన్నారు. తామూ దాడులు చేయగలమని, మా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి రామచంద్రారెడ్డి అలాంటి వక్రబుద్దులు నేర్పలేదని తెలిపారు. యువగళంలో లోకేష్ ప్రజలకు ఏమి చేస్తామో చెప్పలేక పసలేని ప్రసంగాలకు దిగుతున్నాడని ఆరోపించారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ విద్యాసాగర్ మాట్లాడుతూ టీడీపీ సభలకు బీహార్ రౌడీలను తెచ్చి దాడులకు దిగడం హేయమైన చర్యగా పేర్కొన్నారు.

కుప్పం అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శుక్రవారం కుప్పం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. కుప్పం పట్టణ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.66 కోట్లు నిధులు విడుదల చేశారని, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కుప్పం అభివృద్ధికి, సంక్షేమ పథకాల కొనసాగింపునకు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు.

క్లుప్తంగా

గణిత ప్రజ్ఞాధారణ అద్భుతం



మెమెంటోలు అందుకున్న మంగళంపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : గణిత ప్రజ్ఞాధారణ ఓ అద్భుతమని కణ్ణన్ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పూల సుబ్రహ్మణ్యం, గౌరవ అధ్యక్షుడు మునిరత్నం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గణితం అంటే భయపడే గ్రామీణ విద్యార్థులతో ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థుల ప్రజ్ఞ అమోఘమని కొనియాడారు. అవధానిగా అరుణశివప్రసాద్, బంగారుపాళ్యం మండలం మంగళంపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు లహరి, రేవతి, హేమ, పునీత్ సాయి ప్రజ్ఞాధారణతో అందరినీ ఆలోచింపజేశారు. పాల్గొన్న విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం తరుపున రూ.8 వేలు నగదు బహుమతి, మెమెంటోలను అందజేశారు. హెచ్ఎం తులసిబాబు, ప్రిన్సిపల్ సయ్యద్ మౌలా, మంగళంపల్లె హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ హైవే!



పలమనేరు నియోజకవర్గంలో చెన్నై-బెంగళూరు 6 ట్రాక్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు శరవేగంగా సాగుతున్నాయి. మట్టిరోడ్డు పనులు దాదాపుగా పూర్తయ్యాయి. జల్లివేసే కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఈ రెండు మహా నగరాల మధ్య బైరెడ్డిపల్లె వద్ద నిర్మించే జంక్షన్ పనులు సైతం జోరందుకున్నాయి. మూడు ఫేజ్‌లలో నిర్మాణం సాగుతుండగా కర్ణాటకలో 47శాతం పనులు పూర్తయ్యాయి. రెండో ఫేజ్‌లోని పలమనేరు నియోజకవర్గంలో 30శాతం పనులు జరిగాయి. ఈపనులను 2024 ఆగస్టుకల్లా పూర్తిచేసి ప్రారంభించేలా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకుంటోంది.

శరవేగంగా చెన్నై-బెంగళూరు హైవే పనులు
- టార్గెట్ ఆగస్ట్ 2024
- కర్ణాటకలో 47 శాతం పూర్తి
- ఏపీలో ముమ్మరంగా బ్రిడ్జిలు, మట్టిరోడ్డు, కల్వర్టుల నిర్మాణాలు

పలమనేరు : చెన్నై-బెంగళూరు 6 ట్రాక్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు ఊపందుకున్నాయి. చెన్నై సమీపంలోని శ్రీపెరంబూదూర్ నుంచి బెంగళూరు సమీపంలోని హొసకోట వరకు 283.5 కిలోమీటర్ల మేర ఈ రహదారిని ఎన్‌హెచ్ఏఐ భారత్‌మాల పరియోజన పథకం కింద 2021 నుంచి రూ.16,730 కోట్లతో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. 90మీటర్ల వెడల్పు రోడ్డు నిర్మాణంలో భాగంగా మూడు ఫేజుల్లో పనులు సాగుతున్నాయి. తొలిఫేజ్‌లో కర్ణాటకలోని 71 కిలోమీటర్లలో ఇప్పటికే 47 శాతం పనులు పూర్తయ్యాయి. రెండు, మూడు ఫేజ్‌లలో చిత్తూరు జిల్లాలో 30శాతం, తమిళనాడు రాష్ట్రంలో 28 శాతం పనులు పూర్తయ్యాయి. జిల్లాలో 91కిలో మీటర్ల నిర్మాణంలో భాగంగా ఇప్పటికే మట్టిరోడ్డు పనులు, అలైన్‌మెంట్ ల్యాండ్ లెవలింగ్ జరిగింది. జల్లి పరిచే పనులు సాగుతున్నాయి. పనులు త్వరితగతిన జరిగేలా మూడు ఫేజ్‌లను పది ప్యాకేజీలుగా విభజించారు. ఇందులో కర్ణాటకలో మూడు, ఏపీలో మూడు, తమిళనాడులో నాలుగు ప్యాకేజీలు ఉన్నాయి. కర్ణాటక రాష్ట్ర సరిహద్దు నుంచి పలమనేరు నియోజకవర్గంలోని వీకోట, బైరెడ్డిపల్లె, పలమనేరు మండలాల మీదుగా 60 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు సాగుతున్నాయి.

ఎక్స్‌ప్రెస్ హైవే వివరాలిలా..
- చెన్నై- బెంగళూరుకు రోడ్డు దూరం - 283.5కి.మీ
- కర్ణాటకలో 77కి.మీ, ఏపీలో 91కి.మీ, తమిళనాడులో 93కి.మీ
- ప్రస్తుతం బెంగళూరు-చెన్నై ప్రయాణ సమయం 6 గంటలు
- ఎక్స్‌ప్రెస్‌హైవే వస్తే 2 గంటల 15నిమిషాలు మాత్రమే
- ఈ రహదారిలో సాధారణ వేగం గంటకు 120 కి.మీ
- ఎక్స్‌ప్రెస్‌హైవేలో మొత్తం బ్రిడ్జిలు-162
- రైల్వేక్రాసింగ్‌లు-4 కల్వర్టులు-143
- మొత్తం ఫ్లైఓవర్‌లు: 17

మూడు రాష్ట్రాల్లో కనెక్ట్ కానున్న పట్టణాలివే...
- హోస్కోట(బెంగళూరు రూరల్ జిల్లా)
- మాలూరు(కోలారు జిల్లా)
- బంగారుపేట(కోలారు జిల్లా)
- కేజీఎఫ్(కోలార్‌జిల్లా)
- వీ.కోట(చిత్తూరు జిల్లా)
- హైవేజంక్షన్-బైరెడ్డిపల్లె(చిత్తూరు జిల్లా)
- పలమనేరు (చిత్తూరు జిల్లా)
- బంగారుపాళెం(చిత్తూరు జిల్లా)
- చిత్తూరు, గుడిపాల(చిత్తూరు జిల్లా)
- రాణిపేట, వాలాజాపేట్, ఆర్కోణం(రాణిపేట జిల్లా)
- శ్రీపెరంబూదూర్(కాంచీపురం జిల్లా)

దక్షిణాదిలోనే మొట్ట మొదటిది

దక్షిణ భారతదేశంలోనే చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే తొలిదికానుంది. దీనికి ఎన్‌హెచ్ఏఐ ఎన్ఈ-7గా నామకరణం చేశారు. ముఖ్యంగా మూడు రాష్ట్రాల్లో ఆర్థికాభివృద్ధి పెంపొందించడమే ఈ రహదారి నిర్మాణ ఉద్దేశం. బెంగళూరు నుంచి చెన్నై పోర్టుకు రవాణా సౌకర్యాలను పెరిగేందుకు ఈ రోడ్డు ఉపకరిస్తుంది. బెంగళూరు నుంచి చెన్నైకి విమానంలో ప్రయాణించే వారు సైతం తక్కువ దాదాపు అంతే సమయానికి విమాన చార్జీలకంటే తక్కువ ధరతో రోడ్డుమార్గంలోనే ప్రయాణించే సౌకర్యం కలగనుంది.



చెన్నై-బెంగళూరు హైవే నిర్మాణం జరిగాక ఇలా..

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోవడంతో గంగమ్మ గుడి వరకు భక్తులు బారులు తీరారు. గురువారం అర్ధరాత్రి వరకు 58,855 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,014 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 4.65 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమతోంది. టికెట్లు లేనివారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,000
రిటైల్ వెండి గ్రాము	రూ.77.00

చిత్తూరు కోర్టు వద్ద భద్రత పరిశీలన

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో భద్రతను పోలీసు అధికారులు పరిశీలించారు. ఆర్ముడు రిజర్వు ఏఎస్పీ నాగేశ్వరరావు, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తితో కలిసి భద్రతను పర్యవేక్షించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. న్యాయస్థానాల సముదాయంలోకి వెళ్లేప్పుడు తనిఖీలు, బాంబ్ స్క్వాడ్ వ్యవహరించాల్సిన తీరు, అనుమానస్పద వ్యక్తులను గుర్తించడంపై చర్చించారు. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, ఆర్ఐ నీలకంఠేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

అటవీ ప్రాంతంలో దారి దోపిడీ

- వృద్ధుడిపై దాడి చేసి రూ.50 వేలతో దుండగుల పరారీ
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

వి.కోట: మండలంలోని నాయకనేరి అటవీ ప్రాంతంలో దారి దోపిడీ ముఠా వృద్ధుడిపై దాడి చేసి రూ.50 వేల దోచుకెళ్లిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు వి.కోట-పేర్నంబట్ మార్గంలోని నాయకనేరి అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి తమిళనాడు రాష్ట్రం బత్తరపల్లెకు చెందిన చక్రవర్తి (65) ద్విచక్ర వాహనంపై రూ 50 వేల నగదుతో వెళుతున్నాడు. సాయంత్రం 7 గంటల సమయంలోనే అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు అతనిని వెంబడించారు. కొంతదూరం వెళ్లగానే అతనిపై మారణాయుధాలతో దాడి చేసి, అతని వద్ద ఉన్న రూ.50 వేల నగదును లాక్కున్నారు. ఈ సమయంలో కారు వస్తుండడంతో అతన్ని విడిచి నగదుతో ఉడాయించారు. తీవ్రంగా గాయపడిన అతను పేర్నంబట్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన ప్రదేశం తమ పరిధిలోకి రాదని వారు తెలిపారు. దీంతో వి.కోట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలంటూ బాధితుడు పోలీసులను వేడుకుంటున్నాడు.



గాయపడిన చక్రవర్తి

‘జగనన్నకు చెబుదాం’ అర్జీలపై ప్రత్యేక దృష్టి



వినతులను స్వీకరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అందే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా సకాలంలో పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులపై మండల స్థాయిలోనే తక్షణ పరిష్కారం చూపేందుకు చేపట్టిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం చిత్తూరు జిల్లాలో శుక్రవారం పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం నుంచి శ్రీకారం చుట్టారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుతో కలిసి వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారుల సమస్యలను సానుకూలంగా విని, సంబంధిత అధికారులతో సమస్య పరిష్కరించకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమాన్ని మరింత మెరుగు పరిచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో జిల్లా స్థాయి అధికారులతోపాటు మండల స్థాయి అధికారులు భాగస్వామ్యం కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను రిజిస్ట్రేషన్ చేయడం, సమోదైన అర్జీలను అదే రోజు జగనన్నకు చెబుదాం(జేకేసీ) పోర్టల్‌లో రెవెన్యూ అధికారులు నమోదు చేసి పర్యవేక్షించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా అందిన వినతులకు అధిక ప్రాధాన్యమిచ్చి పరిష్కారించాలని ఆదేశించారు. వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు. వందశాతం ప్రభుత్వ నియమ నిబంధనలను పాటిస్తూ సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. సమస్య పరిష్కరించలేని పక్షంలో అందుకు గల కారణాలను అర్జీదారునికి సవ్యంగా వివరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం జిల్లా స్థాయిలో స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధ, శుక్ర వారాల్లో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించడం ద్వారా సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. జగనన్నకు చెబుదాంలో మొత్తం 124 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమానికి హాజరు కాని ఏడీ మైనింగ్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద గార్గేయ నది వంతెన రోడ్డుపై వర్షాకాలంలో తరచూ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఇప్పటికే కొంతమంది వాగుదాటుతూ ప్రమాదానికి గురై మరణించారని, వెంటనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ సుబ్బారెడ్డి, నాయకులు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా పీడీలు తులసీ, గంగాభవానీ, రాధమ్మ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఉమామహేశ్వరరెడ్డి, డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి, డీటీసీ నిరంజన్‌రెడ్డి, ఆర్డీఓ రేణుక, డీఈఓ విజయేంద్రరావ్, డీఎల్‌డీఓ రవికుమార్, పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీపీ మోహన్, తహసీల్దార్ సుశీలమ్మ, ఎంపీడీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ని చూసినట్టుంది సారూ..



కుక్కలపల్లెలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటోను చూస్తున్న వృద్ధురాలు

యాదమరి: అవ్వా.. ఈ ఫొటోను అలాగే ఎందుకు చూస్తున్నావని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఓ వృద్ధురాలని అడగ్గా.. ఉండు సారూ.. జగన్‌బాబు ఫొటో చూస్తుంటే రాజశేఖరరెడ్డిని చూసినట్లుంది సారూ అని చెప్పడంతో అందరూ ఆశ్చర్యపోయారు. శుక్రవారం మండలంలోని కుక్కలపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వం అందించిన పథకాల గురించి ఎమ్మెల్యే బుక్‌లెట్‌ను చూపించి వివరించారు. అంతలో అక్కడ ఉన్న వృద్ధురాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను తదేకంగా చూస్తూ ఉండు సారూ జగన్‌బాబు ఫొటో చూస్తుంటే వాళ్ల నాయన ఫొటో చూసినట్టు ఉంది.. కొద్దిసేపు చూడని అని అడగడంతో అందరూ వృద్ధురాలిని చూస్తుండిపోయారు.

అడవిలో తవ్వితే పీడీ యాక్ట్

సైదాపురం : అడవిలో ఖనిజ సంపద కోసం తవ్వకాలు సాగిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని నెల్లూరు డీఎఫ్ఓ ఆవుల చంద్రశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం సైదాపురంలో ఆయన మాట్లాడుతూ గులించెర్ల అటవీ ప్రాంతంలో నెల్లూరు రేంజర్ మాల్యాద్రి నేతృత్వంలో తనిఖీలు చేపట్టి ప్రొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు చేపట్టిన దాడుల్లో 4జేసీబీలు, ఓ ప్రొక్లెయిన్, టిప్పర్, ట్రాక్టర్ సీజ్ చేసినట్లు వివరించారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

పలమనేరు: సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా సంక్షేమశాఖ అధికారి రాజ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం పట్టణ సమీపంలోని మదర్ థెరీసా కళాశాలలో పలమనేరు నియోజకవర్గంలోని సచివాలయాల సంక్షేమ కార్యదర్శులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చొరవ చూపాలన్నారు. ఏదైనా సాంకేతిక కారణాలతో పథకాలు రాని వారిని సైతం గుర్తించి, వారికి అవసరమైన ధ్రువపత్రాలు అందజేసి, వారికి మళ్లీ పథకాలందేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ముఖ్యంగా ఈకేవైసీ సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని ఎస్సీ హాస్టల్-1ను సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డెన్ మధుసూదన్ రెడ్డిని అభినందించారు. ఈకార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఓలు హైమావతి, నరసింహులు, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి సమీపంలో ఉన్న అరుణానది బ్రిడ్జి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతిచెందింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. పిచ్చాటూరు మండలం గజసింగరాజపురం గ్రామానికి చెందిన మహేష్, దేవి(30) సంతల్లో కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం నాగలాపురం మండలం సురుటుపల్లిలో జరిగిన సంతలో అంగడి పెట్టారు. రాత్రి 8.30 గంటలకు ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో పిచ్చాటూరు మండలం రామగిరి బ్రిడ్జి వద్ద వెనుకవైపు వస్తున్న లారీ మహేష్, దేవి వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవి లారీ టైరు కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. మహేష్ పక్కకు పడిపోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దేవి నడుము నుంచి కింది భాగం రోడ్డుపై పడగా, పైభాగం టైర్ల కింద చిక్కుకుపోయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రెండు భాగాలైన మృతదేహాన్ని గోనె సంచిలో సేకరించి పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడుకు తరలించారు. బ్రిడ్జిపై ప్రమాదం జరగడంతో ఇరువైపులా జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. లారీ డ్రైవర్ పరారయ్యాడని, లారీని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పుత్తూరు రూరల్: వెంకట నరసింహరాజు వారి పేట, నగరి రైల్వే స్టేషన్‌ల మధ్య రైల్వే ట్రాక్‌పై శుక్రవారం మధ్యాహ్నం 1-35 గంటకు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు రేణిగుంట రైల్వే ఎస్ రవి తెలిపారు. సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఉండవచ్చని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎరుపు రంగు షర్టుపై తెలుపు, నలుపు గీతలు, బ్లూ కలర్ లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

శ్రీనివాసశర్మకు జ్యోతిష్య జ్ఞానరత్న అవార్డు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామానికి చెందిన ప్రముఖ పురోహితులు పాణ్యం శ్రీనివాస శర్మకు జ్యోతిష్య జ్ఞానరత్న అవార్డు ప్రదానం చేసినట్లు నిర్వాహకులు కృష్ణమూర్తి, హరిహరన్ తెలిపారు. తిరుపతిలోని ఓ హోటల్‌లో ఉన్న గోల్డెన్ తులిప్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ యూఎస్ఏ ఆధ్వర్యంలో ఆస్ట్రాలజీపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. జ్యోతిష్య జ్ఞానరత్న అవార్డుతో సత్కరించినట్లు వారు చెప్పారు.



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసశర్మ

ప్రేమ విఫలమైందని ఆత్మహత్యాయత్నం

వి.కోట: ప్రేమ విఫలమైందని మండలంలోని కొంగాటం పంచాయితీ శివునికుప్పం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ భానుప్రకాష్ శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల వివరాల మేరకు తిరుపతికి చెందిన ప్రభాకర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గా శివునికుప్పంలో విధులు నిర్వహిస్తున్నాడు.ఈ క్రమంలో ప్రేమించిన అమ్మాయి దూరమైందన్న బాధతో ప్రకాష్ నిద్రమాత్రలు మింగాడు. గమనించిన స్థానికులు, సహచర సిబ్బంది అతన్ని వి.కోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు.

ముక్కంటి ఆలయంలో భద్రతపై సమీక్ష

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని భద్రతా ఏర్పాట్లపై శుక్రవారం పరిపాలన భవనంలో ఆక్టోపస్ అధికారులు, పాలకమండలి సభ్యులు సమావేశం నిర్వహించారు. ఆక్టోపస్ అదనపు ఎస్పీ కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించనున్నట్లు వివరించారు. డీఎస్పీ చిన్నకొండయ్య మాట్లాడుతూ ముక్కంటి ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న భద్రతా సిబ్బంది తక్కువగా ఉన్నట్లు తెలిపారు. మరికొంతమందిని కేటాయించాలని కోరారు. ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఆలయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. తొక్కిసలాటలు జరగకుండా భక్తులకు సకాలంలో దర్శనం చేయిస్తున్నట్లు వెల్లడించారు. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో అదనపు సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని సూచించారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ అంజూయాదవ్ పాల్గొన్నారు.